"ఏరా వెంకటరత్నం. నీ ఇద్దరు కూతుళ్లకైతే గబగబా పెళ్లిళ్ళు చేసేశావు. నా కూతురికి సంబంధాలు చూడమంటే చూడవేమిరా" షాపు గడప ఎక్కుతూనే దాడి ప్రారంభించాడు శేషగిరి.

"ఒరేయ్ అసలు అది నోరేనా? ఏమిత్రా పొద్దున్నే అంత పచ్చి అబద్ధం ఆడుతున్నావు. ఒంగోలు సంబంధం చెప్తే...'ఆ ఊళ్ళో నీళ్లకి కరువు' అన్నావు. భద్రాచలం సంబంధం చెప్తే 'అక్కడ ఎండలు ఎక్కువ' అన్నావు. హైదరాబాద్ అబ్బాయికి అక్కయ్యలు ఎక్కువమంది ఉన్నారన్నావు, విశాఖపట్నం అబ్బాయి 'ఒంటికాయ శొంఠి కొమ్ము' అన్నావు. ఇలా ఒక్కొక్కరికి ఒక్కొక్క వంక పెట్టుకుంటూ పోతే ఇక నీ కూతురికి పెళ్లి ఎలా చేస్తావో నాకు అర్థం కావడం లేదు. నేను మాత్రం ఇక నీకు సంబంధాల గురించి చెప్పను గాక చెప్పను..." నోటి మీద వేలు వేసుకున్నాడు వెంకటరత్నం.

వాళ్లిద్దరూ కాలేజీ మిత్రులు ఒకరినొకరు సరదాగా తిట్టుకోవడం వారికి అలవాటు. వెంకటరత్నం డిగ్రీతో ఆపేసి వారసత్వంగా వచ్చిన బియ్యం వ్యాపారంలో స్థిరపడ్డాడు.

# కీలకం

**-కోపూరి పుష్పాదేవి**



శేషగిరి పీజీ చేసి పోస్టల్‌లో ఉద్యోగం సంపాదించాడు. పోస్టు మాస్టర్‌గా రిటైరై ఇప్పుడు సొంత ఊరు విజయవాడ వచ్చి ఇల్లు కట్టుకుని స్థిరపడ్డాడు.

అతనికి ఒక్కతే కూతురు అఖిల ఎంసియే చేసింది. అపరంజి బొమ్మ. అపురూపంగా పెంచిన తన కూతుర్ని ఓ అయ్య చేతిలో పెట్టాలని తర్జన భర్జన పడుతూ తికమకపడుతూ వచ్చిన సంబంధమల్లా తిరగకొడుతున్నాడు శేషగిరి.

రోజూ సాయంత్రం వెంకటరత్నం షాపునకు వచ్చి గంటో రెండో రెండుగంటలో బాతాఖానీ వేసి ఒకటో రెండో టీలు తాగి వెళ్లడం శేషగిరికి క్రమం తప్పని అలవాటు.

* * *

అఖిల కోసం లెక్కలేనన్ని సంబంధాలు చూశాడు శేషగిరి. కానీ ఒక్కటి కూడా అతనికి నచ్చేది కాదు. ఒక వరుడికి ఆస్తి ఎక్కువ లేదంటాడు. ఒక వరుడు నలుపంటాడు. ఒకతను మరీ ఎత్తుగా ఉన్నాడంటాడు.

"చాలా చాలా ప్లస్ పాయింట్లునప్పుడు ఏదో ఒక చిన్న మైనస్ పాయింట్‌ను మనం లెక్కచెయ్యకూడదు" అంటాడు వెంకటరత్నం.

"ఊఁహ్. అలా కుదరదు.." అంటాడు శేషగిరి.

"మనమ్మాయికి అందం ఉంది. చదువు ఉంది. కోరినంత కట్నం ఇవ్వగలం. కనుక అన్నీ ప్లస్ పాయింట్లున్న అబ్బాయే కావాలి నా బంగారుకొండకి" అంటాడు శేషగిరి.సరే..చివరికి ఎలాగో అదృష్టవశాత్తూ అతని కోరికలకు సరిపోయిన వరుడు దొరికాడు. అతడే గోపాల్. అందగాడు, ఆస్తిపరుడు. ఎంటెక్ చేశాడు. మంచి ఉద్యోగం చేస్తున్నాడు. కుటుంబం, సంప్రదాయం అన్నీ సరిపోయాయి. శేషగిరి చాలా చాలా సంతోషించి ధూమ్ ధామ్‌గా వివాహం చేసేశాడు. అమ్మాయి అత్తవారింటికి వెళ్లింది. ముచ్చటగా మూడు నెలలు కాపురం చేసింది. గోడకు కొట్టిన బంతిలా తిరిగి వచ్చింది.

ఆరోజు శేషగిరి వెంకటరత్నం షాపుకి ఉస్సూరుమంటూ వచ్చాడు.

"ఏరా నీ కూతుళ్లిద్దరూ చక్కగా సంసారాలు చేసుకోవడం లేదూ. పిల్లాపాపలతో హాయిగా లేరూ. నా కూతురేమిత్రా కాపురానికే పోనంటూంది" కళ్ల నీళ్ళు ఒకటే తక్కువగా ఉన్నాయి అతనికి.

"ఏమిత్రా..అసలు సంగతేమిటి. గొడవలు ఎందుకు వచ్చాయి? కట్నం చాల్లేదా? కానుకలు చాల్లేదా? అబ్బాయికేమన్నా వ్యసనాలున్నాయటా? మనం మోసపోయామా?" ఆందోళనగా ప్రశ్నల వర్షం కురిపించాడు వెంకటరత్నం.

"అబ్బెబ్బె...అవేమీ కాదురా. కట్నకానుకల గురించి వాళ్లు పెళ్లప్పుడే ఒత్తిడి చెయ్యలేదు. అబ్బాయికి వ్యసనాలేం లేవు. కనీసం కాఫీ, టీలు కూడా తాగడు"

"మరి..."

"ఏం లేదు మొన్న ఓ పదిరోజులు పనిమనిషి రాలేదట. అప్పుడే ఆడబడుచూ ఆమె పిల్లలూ వచ్చారట. అన్నీ హోటల్స్ నించి తెచ్చినా కొద్దిగా పని చెయ్యవలసి వచ్చిందంట. అదీగాక అల్లుడు దీనికి ఇవ్వవలసిన గౌరవం ఇవ్వడం లేదని దీనికి అనుమానమట. ఇంకా ఏవేవో ఇలాంటి చిన్న విషయాలే చెప్పింది" అన్నాడు శేషగిరి.

"నీకు చిన్న విషయాలే కావొచ్చు. ఆమెకు అవే పెద్దవిగా కనబడుతున్నాయేమో!" అన్నాడు వెంకటరత్నం.

"అదేరా ఇప్పుడు వచ్చిన బాధ. ప్రతీదాన్నీ భూతద్దంలోంచి చూసి మరీ బాధపడుతోంది. వాళ్ళమ్మా, నేనూ ఎంత చెప్పినా వినడం లేదు. విడాకులకు అప్లై చేస్తానంటోంది" కళ్లల్లో నీళ్ళు నిండాయి శేషగిరికి. గొంతు వణికింది.

"విడాకులా!" విస్తుపోయాడు వెంకటరత్నం.

"ఒరే!ముమ్మాటికీ ఇది నీ తప్పేరా, అఖిలది కానేకాదు" శేషగిరి మీద విరుచుకుపడ్డాడు.

"అదేమిత్రా నన్నంటావు...మధ్యలో నేనేం చేశాను?"

"చేసిందంతా నువ్వే. మన పిల్లలు మనకెంత అపురూపమైనా వాళ్లను చిన్నప్పటినుంచీ కాలు కందకుండా, కష్టం సుఖం తెలియకుండా పెంచకూడదు. మనం ఎంతసేపూ వాళ్లకి ఆస్తులూ, అంతస్తులూ సమకూర్చితే, గొప్ప చదువులు చదివిస్తే మన బాధ్యత తీరిపోతుందనుకుంటాం. వారికి లోకం పోకడ తెలియజెప్పాలి. ఎటువంటి విషమ పరిస్థితులెదురైనా తట్టుకోగలిగే గుండె నిబ్బరం అలవరచాలి. మనుష్యులు కేవలం డబ్బువల్లే సుఖపడరురా. మనసు వల్ల సుఖపడతారు. ఆ మనసు వల్లే సౌఖ్యాలు పొందుతారు"

"నిజమేరా. ఒక్కగానొక్క బిడ్డ అనీ దానికి ఏ లోటూ రాకూడదనీ తాపత్రయపడ్డానే గానీ నా అజ్ఞానం వల్ల దాని మనసు ఎలా ప్రభావితం అవుతుందో తెలుసుకోలేకపోయాను. సరే జరిగిందేదో జరిగిపోయింది. రేపు మీ ఇంటికి తీసుకువస్తాను. దానికి అన్నివిధాలా నచ్చజెప్పి తిరిగి కాపురానికి పంపే బాధ్యత నీదే" భారం అంతా మిత్రుడి మీద మోపి శేషగిరి ప్రశాంతంగా నిట్టూర్చాడు.

★